# నష్టాల్లో టమాట రైతులు

- పెట్టుబడి కూడా దక్కదని అన్నదాతల ఆవేదన
- ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని వేడుకోలు



టమాటను మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

**మడకశిరరూరల్:** టమాట రైతులు మళ్లీ నష్టాల బాట పట్టారు. ఈ ఏడాది బోరు బావుల కింద అప్పులు చేసి సాగు చేసిన టమాటా దిగుబడి బాగా ఉన్నా ధర లేక నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది.

**రూ.50 నుంచి వంద వరకూ...**

ప్రస్తుతం మార్కెట్‌లో టమాట కాయల నాణ్యతను బట్టి 12 కేజీ బుట్టీ (బాక్స్) రూ.50 నుంచి రూ.100 వరకు అడుగుతున్నారు. పండించిన పంట చేతికందే సమయంలో ధర తగ్గిపోవడంతో రైతులందరూ నష్టపోవాల్సి వస్తోంది. ఆగస్టు నెలలో ఉన్న ధరలు ప్రస్తుతం ఉంటే కొంత వరకు ఆదాయం వచ్చేదని అన్నదాతలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి టమాటకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

**800 ఎకరాల్లో సాగు**

మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో బోరు బావుల కింద రైతులు దాదాపు 800 ఎకరాలకు పైగా టమాట పంటను సాగు చేశారు. పండించిన పంటను హిందూపురం, మదనపల్లి, చింతామణి, కోలార్ తదితర ప్రాంతాల్లోని మార్కెట్‌కు తీసుకెళ్తుంటారు. అక్కడ తక్కువ ధరకు అడుగుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. రవాణా, కూలీ ఖర్చులు వస్తున్నాయని వాపోతున్నారు. కనీసం స్థానిక మార్కెట్ సౌకర్యం ఉంటే రవాణా ఖర్చులు మిగిలేవని చెబుతున్నారు.

### ప్రభుత్వం ఆదుకోవాలి



బోరు బావి కింద అప్పులు చేసి 2.50 ఎకరాల్లో టమాటను సాగు చేశాను. పంట దిగుబడి బాగా వచ్చినా మార్కెట్‌లో ధర లేక నష్టపోతున్నాను. గత నెలలో ధర ఉండడంతో రూ.1.50 లక్షలు వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ధర లేకపోవడంతో కూలీ, రవాణా ఖర్చులు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– సిద్దప్ప, అమిదాలగొంది, మడకశిర మండలం

### గిట్టుబాటు ధర కల్పించాలి



బోరు బావి కింద ఎకరాకు రూ.లక్ష చొప్పున ఖర్చు పెట్టి నాలుగు ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో టమాట పంటను సాగు చేశాను. పంట బాగా ఉంది. దిగుబడి కూడా బాగా వస్తుంది. 25 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర ఉంటే నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. – దివాకర్, చెందకచెర్లు, మడకశిర మండలం

## క్లుప్తంగా

### కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు



లేపాక్షిలో రోడ్డుకు అడ్డంగా వెళ్తున్న కుక్కలు

**లేపాక్షి:** మండల కేంద్రమైన లేపాక్షిలో కుక్కలు బెడద ఎక్కువ కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధాన రహదారులు, వీధుల్లో కుక్కలు సంచారం ఎక్కువై ప్రజలపై దాడి చేస్తున్నాయి. చికెన్, మటన్ సెంటర్ల వద్దకు వచ్చిన కొనుగోలుదారులు అటుగా వెళ్లాలంటేనే ఆందోళన చెందుతున్నారు. లేపాక్షిలో ఆదివారం జరిగిన సంతకు వచ్చిన వారిపై కుక్కలు దాడి చేశాయి. ఇందులో ఏడుగురికి గాయాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్యం చేయించుకున్నారు. అధికారులు స్పందించి కుక్కల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

### కియా కార్మికుడికి గాయాలు

**పెనుకొండ రూరల్:** రోడ్డు ప్రమాదంలో కియా కార్మికుడు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... మక్కాజిపల్లి తండాకు చెందిన రవిప్రసాద్ నాయక్ కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజులాగే పరిశ్రమకు వెళ్తుండగా మార్గమధ్యలో అమ్మవారిపల్లి వద్దకు రాగానే, బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్తున్న ఐచర్ ఢీ కొంది. గాయపడిన వ్యక్తిని స్థానికులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### అ'పూర్వ' సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**మడకశిర:** పట్టణంలోని 8వ వార్డు ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2006–07 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులందరూ కలసి నాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. చదువు చెప్పిన నాటి ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్, హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు నాగేంద్రప్ప, హనుమంతరాయప్ప, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషి

**అగళి:** గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతం చేసుందుకు అందరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఇరిగేపల్లిలో ఆయన పర్యటించారు. మండలంలో వైఎస్సార్‌సీపీకి మంచి ఆదరణ ఉందని, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

### కాడు గొల్లలు విద్యావంతులుగా ఎదగాలి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన దృశ్యం

**పావగడ:** కాడు గొల్ల సామాజిక వర్గానికి చెందిన పిల్లలు విద్యావంతులుగా ఎదిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐఏఎస్ అధికారిణి సత్య భామ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌ఎస్‌కే సముదాయ భవనంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అసమానతలు తొలగుతాయన్నారు. అనంతరం ప్రతిభావంతులైన 39 మంది పీయూ విద్యార్థులు, 61 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పవన్ మాట్లాడరా?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



**మడకశిర:** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలలపై మంత్రులు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. మంత్రులు అనిత, సవిత మెడికల్ కళాశాలలపై మాట్లాడిన తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. హోం మంత్రి అనిత మెడికల్ కళాశాలలపై పాత ఫొటోలతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి ప్రజలను తప్పు దోవ పట్టించారని పేర్కొన్నారు. అలాగే సవిత తన సొంత నియోజకవర్గం పెనుకొండలోని మెడికల్ కళాశాల ప్రైవేట్ పరం అవుతున్నా అడ్డుకోవడానికి ప్రయత్నించకపోవడం దారుణమన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రజలను విస్మరించారన్నారు. 17 మెడికల్ కళాశాలలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేట్‌పరం చేయడానికి జీఓ జారీ చేసినా పవన్‌కల్యాణ్ నోరు మెదపకపోవడం సరికాదన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ జారీ చేసిన జీఓను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## విమాన గోపురం నిర్మాణానికి శ్రీకారం



బండరాళ్లతో పునాదులు పరుస్తున్న దృశ్యం

**రొళ్ల:** మండల పరిధిలోని జీరిగేపల్లిలో వెలసిన అమ్మాజి దేవాలయం ఎదురుగా నూతనంగా విమాన గోపురం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్రైన్ సహాయంతో పునాదులు తవ్వి పరిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది వరకే పాత ఆలయం స్థానంలో రూ.3.5 కోట్ల వ్యయంతో ఆలయ పునః నిర్మించారు. అయితే మళ్లీ ఆలయం చుట్టూ బండరాళ్లతో రూ.2.5 కోట్ల వ్యయం అంచనాలతో ప్రహరీ, ఆలయం ఎదురుగా విమాన గోపురం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన



పూలరథంలో కొలువుదీరిన రంగనాథస్వామి

**హిందూపురం:** పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయంలో గిరి ప్రదర్శన ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చి గిరి ప్రదర్శన చేశారు.

## కంపచెట్లు తొలగించండి



రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు

**అమరాపురం:** మండల పరిధిలోని వీరాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో కంపచెట్లు రోడ్డుకు ఇరువైపులా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మలుపులు ఉన్న చోట రోడ్డు కనిపించడంలేదని, దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని కంపచెట్లు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ముస్తాబవుతున్న అతిథి గృహం



అతిథి గృహానికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**పెనుకొండ:** పట్టణంలోని పీఆర్ అతిథి గృహం ముస్తాబవుతోంది. ఇటీవల 'సాక్షి'లో అతిథి గృహం అధ్వాన్న స్థితిపై కథనం వచ్చింది. దీనికి స్పందించిన పీఆర్ ఈఈ మురళీ మోహన్ అతిథి గృహాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. మరమ్మతు పనులు ప్రస్తుతం పనులు ముగింపు దశలో ఉన్నాయి. దీంతో ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**రొళ్ల:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో విన్నవించుకోవాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు విధిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సిద్ధేశ్వరా నమోస్తుతే !



అలంకరణలో హేమావతి సిద్ధేశ్వరస్వామి

**అమరాపురం:** హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మండలం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు.



రొళ్ల మండలం టీడీ పల్లిలో...

**రొళ్ల:** మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూల ప్రతిమకు గంగా జలంతో శుద్ధి చేసి అభిషేకించారు. అనంతరం వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటకాలు చేసి స్వామివారి ప్రతిమ వద్ద నైవేద్యంగా సమర్పించారు.

## పాలస్తీనాకు సంఘీభావం తెలపడం హర్షణీయం

**హిందూపురం:** పాలస్తీనాకు భారత్ సంఘీభావం తెలపడం హర్షణీయమని, ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్‌ఫరూఖ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా ఒత్తిడితో తటస్థంగా ఉన్న భారత ప్రభుత్వం అమెరికాను ఎదిరించి పాలస్తీనాకు సంఘీభావం తెలపటంతో అభినందనీయన్నారు. పాలస్తీనాలో ఆకలితో అలమటిస్తున్న చిన్నాలకు ఆహార ధాన్యాలు, మందులను అందించాలన్నారు.

## విద్యార్థులకు భగవద్గీత పోటీలు

**హిందూపురం టౌన్:** పట్టణంలోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్మయ విద్యాలయంలో ఆదివారం విద్యార్థులకు అంతర పాఠశాల భగవద్గీత పోటీలను నిర్వహించారు. దాదాపుగా 19 పాఠశాలల విద్యార్థులకు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాతాజీ సుబదానంద, చిన్మయ మిషన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, మిషన్ వైస్ ప్రెసిడెంట్ మంజులమ్మ, కార్యదర్శి రఘునందన్ గుప్తా, ప్రోగ్రాం కన్వీనర్ శ్రీనివాసమూర్తి, విద్యాలయ కరస్పాండెంట్ బీమరాజు తదితరులు పాల్గొన్నారు.

## కంటైనర్‌ను ఢీకొన్న స్కార్పియో

**గోరంట్ల:** మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో ఆదివారం కంటైనర్‌ను వెనుక వైపు నుంచి స్కార్పియో ఢీకొంది. ఈ ఘటనలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న నాలుగురు గాయపడినట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... బెంగళూరు వైపు నుంచి వస్తున్న కంటైనర్‌ను స్కార్పియో వాహనం వెనుక వైపు నుంచి ఢీ కొందన్నారు. స్కార్పియోలో ఉన్న అనంతపురానికి చెందిన మనోహర్, ఆయన భార్య విజయకుమారి, ఇద్దరు పిల్లలు గాయపడ్డారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు

**మడకశిర:** కూటమి ప్రభుత్వం తీసుకున్న పీపీపీ విధానంతో రాష్ట్రంలోని బహుజనులకు వైద్య విద్య దూరం కావడం ఖాయమని దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. 17 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ జారీ చేసిన జీఓను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులు ఆ విధానం వలన నష్టపోతారన్నారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే పేదలు ఎదురు తిరగడం ఖాయమని హెచ్చరించారు.

## సత్యసాయి భక్తుల భజన

**పెనుకొండ:** నగర పంచాయతీ పరిధిలోని మహదేవపల్లిలో ఆదివారం పశ్చిమ గోదావరికి చెందిన సత్యసాయిబాబా భక్తులు ప్రత్యేక భజనలు నిర్వహించారు. పుట్టపర్తిలో బాబా సమాధిని దర్శించుకున్న అనంతరం మహదేవపల్లికి చేరుకుని గ్రామంలో భజనలు చేశారు.

## వైభవంగా గణేశ్ నిమజ్జనం



వ్యవసాయ బావిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

**అమరాపురం:** మండల కేంద్రమైన అమరాపురంలోని వినాయకనగర్‌లోని హిందూ మహాగణపతిని ఆదివారం తెల్లవారుజామున తమ్మడేపల్లి రోడ్డులో ఉన్న కాల్వే ఈరన్న వ్యవసాయ బావిలో ఘనంగా నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి నుంచి భక్తుల కోలాహలం మధ్య శోభయాత్ర సాగింది. స్వామి వారి లడ్డు ప్రసాదం రూ.1.60 లక్షలకు పలికింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

## 'తోపుదుర్తి'కి ఘన నివాళి



భాస్కర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

**మడకశిర:** వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి భౌతికకాయం వద్ద వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప నివాళులర్పించారు. ఆదివారం ఆయన అనంతపురంలోని మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ కూడా తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

## ఉచిత వైద్య శిబిరం

**అమరాపురం:** స్థానిక హేమావతి రోడ్డులో ఉన్న గుండేగౌడ ఆస్పత్రిలో ఆదివారం సంతానం లేని వారికి ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ చైత్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 74 కుటుంబాల వారికి వివిధ సలహాలు, సూచనలు ఇచ్చారు.

## తిమ్మగానిపల్లిలో కంపు.. కంపు



ఎస్సీ కాలనీలో అపరిశుభ్రంగా సిమెంట్ రోడ్డు



నీటి పైపు లీకేజీ అవుతున్న దృశ్యం



దుర్వాసన వెదజల్లుతున్న మురుగు కాలువ

**లేపాక్షి:** మండలంలోని తిమ్మగానిపల్లిలో పారిశుద్ధ్య లోపంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామంలో డ్రైనేజీల నిండా మురుగు నీరు నిల్వ ఉండడం, డ్రైనేజీల చుట్టూ పిచ్చి మొక్కలు , కొన్ని డ్రైనేజీలు పూర్తిగా పూడి పోయిన వాటిని శుభ్రం చేయకపోవడంతో విషజ్వరాలు సోకుతున్నాయి. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. ఈగలు, దోమలు, ఇతర క్రిమి కీటకాలు, విషపురుగులు వృద్ధి చెంది రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాల్లో పైప్‌లైన్లు లీకేజీలు కావడం నీరు కలుషితంగా మారుతోంది. ఖాళీ ప్రదేశాలతో పాటు డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు మురుగు నీటితో నిండి రహదారులు మీదుగా మురుగు నీరు పోతోంది. దీంతో మురుగునీటి వాసనను ప్రజలు భరించలేక పోతున్నారు.

## కడమలకుంటలో సమస్యల తిష్ట



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

**పావగడ:** తాలూకాలోని కొడమడుగు గ్రామ పంచాయతీ పరిధికి చెందిన కడమలకుంట గ్రామంలోని దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు గ్రామ పంచాయతీ అధికారులను కోరారు. కాలనీలో చరండి వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్యలోని రోడ్డులో మురుగు నీరు పారుతుండటంతో దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఆర్వో ప్లాంటు చెడిపోవడంతో తాగు నీరు లభించడం లేదన్నారు. తాగు నీటి వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామ పంచాయతీ పీడీఓ దాదులూరప్ప ఎస్సీ కాలనీని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి తర్వాత పట్టించుకోలేదన్నారు.